# పటంతో పాట్లు

రచన:
శ్రీ. కలగర్ల నీలకంఠేశ్వరరావు.

వు రెప్పుడూ ఇలాంటి సంఘటన లేవీ విని యుండరు. ఒక చిత్రాన్ని గోడకు తగిలించడంలో మామయ్య చేసిన బస మీరువింటే పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వుతారు. మొన్న వేసవి సెలవుల్లో నేను మా మామయ్యగారింటికి వెళ్ళి ఇదంతా చూసేను.

మా మామయ్య ఒక చిత్రాన్ని చాలా డబ్బుపెట్టి ఒక షాపునుండి కొని తెచ్చేరు. ఇక దాన్ని మా మామయ్య ఇంటికి తెచ్చేరో లేదో దాని చుట్టూ అయన సంతానం అంతా మూగిపోయి తలో రఖంగా మాట్లాడుకో జొచ్చేరు.

"నాన్నా! ఇలాంటి బొమ్మెమిటి తెచ్చేవు? సరస్వతీ బొమ్మ అయివుంటే బావున్ను" అని ఒకడు.

"ఆ కట్టు ఏమీ బావులేదు; నాలుగు రోజుల్లోనే వూడిపోతుంది" అని ఇంకొకరు.

"ఊరుకోండిరా చాల డబ్బుపెట్టికొని తెస్తే ఇంకా దానిలో వంకరలు కూడా తెస్తున్నారు" అన్నారు మామయ్య.

ఇంతలో మా అత్త అటుగావచ్చి "ఎందుకండీ అంత డబ్బుపోసి ఆ పటం కొన్నారు?" అంది.

"నీకెందుకే నోరు మూసుకొని పడుండక వెళ్ళు వెళ్ళి నిచ్చెన పట్టుకురా" అన్నారు. మామయ్య.

"ఇప్పుడెందుకండీ రాత్రి ఎనిమిదయింది. రేపు ప్రొద్దుట చూసుకుందురుగాని"

"అబ్బా! నీతో వచ్చిన చావే ఇది. వెళ్ళి నిచ్చెన పట్టుకొస్తావా లేదా?" అంటూ తన చేతి కర్రను పైకెత్తేరు.

మారు మాటాడకుండా మా అత్తవెళ్ళి నిచ్చెన తెచ్చింది.

"ఒరే రామా నువ్వెళ్ళి అరణాల మేకులు పట్టుకురా. లక్ష్మి నువ్వెళ్ళి సుత్తి పట్టుకురా, ఒరే గోపిగా అప్పుడే నిద్దర ఏమిట్రా వెళ్ళి స్కేలు పట్టుకురా, ఒరే బాబిగా అరే రామూ గాడు మేకులు తేవడానికి వెళ్లేడు కొలత చెప్పడం మర్చిపోయేను వెళ్ళి చెప్పిరా" అంటూ వాడికి మేకల కొలత చెప్పేరు.

ఇలా ఒక్కొక్కరికీ పని జత్తాయించి మా అత్తను లైటు పట్టుకోమన్నారు.

ఇక మామయ్య పంపిన వారంతా చెప్పిన వస్తువులతో వచ్చేరు.

మా మామయ్య నిచ్చెన గోడకానించి క్రిందవున్న ఎవరో పటాన్ని అందివ్వగా జాగ్రత్తగా దాన్ని అందుకో బోయేరు కానీ అది అతని చేతిలోంచి జారిపడిపోయింది. పాపం మామాయ్య దాని అద్దాన్ని పగులకుండా చేద్దామనే ఉద్దేశంతో పట్టుకో బోగా అతని వ్రేలు అద్దానికి తగిలి కోసుకుంది.

గబగబా మామయ్య క్రిందికి దిగి వ్రేలికి వచ్చిన రక్తం తుడుచుకోవటానికి తన చేతి రుమాలు కోసం వెతకసాగేరు, అ జేబు రుమాలు మా మామయ్య కోటులో వుండి పోయింది. ఆకోటు ఇపుడు కనిపించటంలేదు,

మా మామయ్య తన కోటుని వెతకటానికి ఇంటివారికి ఆపని అప్పజెప్పి తను ఒక కుర్చీ మీద కూర్చున్నారు.

కానీ ఆకోటు తను ఎక్కడ పెట్టేరో, పాపం అందరూ ఇల్లంతా వెదికేరు. ఎక్కడా కోటు కనిపించలేదు.

''కోటు ఎక్కడుందో వెతకలేరు. తిన మంటే నాలుగు కంచాలు తింటారు. పోనీ నా తువ్వాలు ఇలా తెండి'' అంటూ మామయ్య కుర్చీమీద నుంచి లేచి ఆశ్చర్య పోయేరు. ఎందుకంటే ఇంతసేపు మామయ్య ఆకోటు మీదే కూర్చుని వున్నారు. గబగబా రుమాలు తీసి వేలికి చుట్టుకొని మళ్ళీ ప్రారంబించేరు. ఇలోగా పటానికి కూడ క్రొత్త అద్దంవేయించి తెప్పించేరు.

గోడకు నిచ్చెన ఆనించివుంది. దానిచుట్టూ మామయ్య కుటుంబం అర్ధవృత్తాకారంగా నిలబడివున్నారు. ఒక మేకు పట్టుకొని మామయ్య నిచ్చెన ఎక్కేలోగా ఆమేకు ఆతని చేతిలోంచి జారి ఎక్కడో పడిపోయింది. ఇక అందరూ ఆమేకుని వెతకటం ప్రారంబించేరు. మామయ్య కూడ క్రిందికి దిగి వెతకటం ప్రారంబించేరు.

అరణాలమేకులు తెచ్చేరు. వానిలోంచి ఇంకో మేకు తీసుకోకూడదు. ఊహూ! ఆ మేకే వెతకాలి.

ఇలా ఒక అరగంట గడిచిన తరువాత ఎవరికో ఒకరి దొరికింది. దాన్ని మామయ్య చేతికిచ్చేరు.

''అరెరే సుత్తేది? ఎక్కడో పెట్టి మర్చిపోయేను. చూడండి'' అంటూ మళ్ళీ ఆజ్ఞాపించేరు మామయ్య.

చివరికి ఆ సుత్తి వాళ్లలో ఎవరికో ఒకరికి దొరికింది. సరే, సుత్తిదొరికింది. మామయ్య ముందు పఠాన్ని ఎక్కడ పెట్టాలో అక్కడ చీమ తలకాయలో 100 భాగమంత మార్కును పెనసలుతో పెట్టి వుంచేరు ఆ దిప్పుడు ఆ గోడమీద ఎక్కడ పెట్టేరో మామయ్య మరిచిపోయేరు.

ఇప్పుడు అందరూ ఆమార్కు కోసం వెతకసాగేరు.

మా మామయ్య మధ్యన నిచ్చెన మీంద న్చిలోని దానిగురించి వెతుకుతుంటే ఆయన కిరుప్రక్కలా అందరం నిల్చొని మార్కును వెదక సాగేము. చివరకి మామయ్య నిల్చొని వున్న ఒక అడుగు దూరానికి ఆ మార్కు ఎవరికో కనిపించింది. ఇక చూసుకోండి మా మయ్య కోపం.

'దొంగ వెధవలు నిచ్చెన నే నొక దగ్గర పెట్టమంటే ఇంకొక దగ్గిర పెట్టేరు. తెలివి తక్కువ దద్దమ్మలు. మీలో ఒక్కరూ, మరి బాగుపడరు'

తరువాత, అతను, ఆ మార్కు గోడ మూలనుండి ఎన్నిఅంగుళాలుందో కొలవ డానికి ఒక దారంముక్కను పట్టుకొని దాని మొక్క ఒక చివర, ఆ మార్కుదగ్గరుంచి రెండో చివర, గోడ మూలకు తాకిద్దామని ప్రయత్నించేరు. కానీ ఆచివర మూల అతను నిల్చున్న నిచ్చెననుండి ఏ మూడు నాలుగు

అడుగుల దూరంలోనోవుంది. ఆ ప్రయత్నంలో ఆయన కాలు నిచ్చెనమీదనుంచి జారి, ఆయన ప్రక్కనున్న, పియానో మీద పడి పోయేరు. మావయ్య యొక్క స్థూలకాయం ఆ పియానోమీద పడగానే చాలా మంచి సంగీతం దాన్లోంచి వచ్చింది. కానీ అది తరువాత పాడయిపోయింది.

'నేను చెబితే విన్నారు. తెల్లవారితే గోడపై వ్రేలగడదామంటే, ఇప్పుడే ఆ పని చేస్తానన్నారు. నామాట గడ్డిపోచకన్నా అద్దానం.' అంటూ మా అత్త నసిగింది.

'నోరుముయ్యి! నీవల్లే ఇదంతా జరిగింది. అసలు పటాన్ని తేవడమే నీకిష్టంలేదు. శనిగ్రహం' అంటూ మామయ్య మళ్ళీ నిచ్చెన మీద కెక్కేరు.

ఈసారి మా మయ్య చేతిలోసుత్తిని' మేకుని పట్టుకొనే నిచ్చెన ఎక్కేరు. ఎడమ చేతిలో మేకుని పట్టుకొని దాన్ని మార్కు మీద పెట్టేరు, కుడిచేతిలో సుత్తి పట్టుకొని మేకుపై ఒక్క దెబ్బ కొట్టేరు. కానీ ఆదెబ్బ మేకుపై పడ్డానికి బదులుగా ఆయన బొటన వ్రేలిపై పడింది. ఆ బాధతో ఆయన కుడి చేత్తో ఆ వేలు పట్టుకుందామని చేతిలో వున్న సుత్తిని క్రింద వదిలివేసేరు. అది సరాసరి వెళ్ళి బాబిగాడి కాలి వ్రేళ్ళ మీద పడ్డాది. ఇక వాడు ఏడుపు లంకించుకున్నాడు. వాడ్ని సముదాయించేసరికి పది నిముషాలు పట్టింది.

'మీతో ఇక కాపురం చేయలేనండి. మా పుట్టింటికి నేను పోతాను. లేకపోతే ఏమిటండీ ఇదంతా ఇప్పటికైనా ఆప్రయత్నం మానండి.' అంది విసిగెత్తి పోయిన మా అత్త.

'అబ్బబ్బా! నీలాంటి ఆడవాళ్ళందరూ చిన్న చిన్న విషయాలమీద తగవులు తెస్తారు. నువ్వోరు మూసుకో' అని మళ్ళీ సుత్తి పట్టుకొని, ముందులాగే మేకు పట్టుకొని దాని మీద సుత్తితో కొట్టేరు. ఈ సారి ఆ దెబ్బ మేకు మీద పడిందిగాని సుత్తిని వెంటనే మేకు మీద నుంచి తీసేటపుడు ఆ సుత్తి వెళ్ళి మావయ్య ముక్కుమీద తగిలింది. పాపం ఆయనకెంత బాధ కలిగిందోగాని దాన్ని పైకి తెలియనీలేదు.

అర్ధరాత్రి, టంగు, టంగున పన్నెండు గంటలు కొట్టింది. అందరి కళ్ళూ వాలిపోతున్నాయి. చివరికి మావయ్య పటాన్ని గోడకు తగిలించేరు. అదీఎలాగనుకున్నారు?వంకరగా, చూడటానికి అసహ్యంగా, నిచ్చెన దిగుతూ మావయ్య ఇలా అన్నారు. 'ఇలాంటి చిన్న చిన్న పనులు చేయడానికి కొందరు ఒక నౌకరును ఎందుకుంచుకుంటారో నా కర్థం కాదు.'

(ఒక ఇంగ్లీషు కథ ఆధారంగా)

